# అడవిని దాటని మనిషి

- ఎం.వి.రామిరెడ్డి

దట్టమైన అడవి.

మనిషి ఒకడు వేటకు బయల్దేరాడు. అతని చేతిలో ఈటె ఉంది. బొడ్లో బాకు ఉంది. మనిషి మొరటుగా ఉన్నాడు. మొలకు వెడల్పాటి ఆకులు కట్టుకున్నాడు. మరే ఆచ్ఛాదనా లేని దేహం ఆ అడవిలో పొదలా కదిలింది.

దుప్పి ఒకటి అతని కంటపడింది.

వెంబడించాడు. అలుపెరుగని పరుగు.

ఆకలి సెగ తగిలి మాడిపోతున్న కడుపు తప్ప ఇంకే లక్ష్యమూ లేదు.

చెట్లు, పుట్టలూ దాటాడు.

దుప్పి అలసిపోయింది.

మనిషి ఈటె విసిరాడు.

\- - -

కాలం అనేక శతాబ్దాలను వెంటబడి తరిమింది. మనిషి మరెన్నో దశల పరిణామాల్ని దాటాడు.

నాగరికుడయ్యాడు.

అడవుల్ని వెలేశాడు. మృగాల్ని వదిలేశాడు.

ప్రపంచాన్ని ఆక్రమించుకుని తనకు తాను 'రాజు'గా ప్రకటించుకున్నాడు.

\- - -

2001 సెప్టెంబరు 11, న్యూయార్క్...

అమెరికా ఆర్థిక శిఖరం గర్వంగా నుంచొని ఉంది. వందలాది అంతస్తుల నిండా వేలాది మంది వాణిజ్య లావాదేవీల గుట్టుమట్లు శోధిస్తున్నారు.

అగ్రరాజ్యంతో వ్యాపార వియ్యమందేందుకు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల కీలక వ్యక్తులు ఆ ఆకాశహర్మ్యంలో బారులు తీరారు. ఓ విదేశీ టూరిస్టు 110 అంతస్తులూ దాటి గగనతలంతో భాషిస్తున్నట్లున్న టెర్రస్‌పై నిలబడి ఫోటో తీయించుకుంటున్నాడు.

అతడి చిర్నవ్వు కెమెరా కంట్లోకి దూసుకుపోయిన మరుక్షణంలోనే...

ఒక విమానం ఆ భవన శిఖరాన్ని ఢీకొట్టింది. ఉక్కు సిమెంటు, అద్దాలను నిట్టనిలువునా చీలుస్తూ భవనంలోకి దూసుకుపోయింది. ఆగని వేగంతో మరోవైపు నుంచి బయటికొచ్చింది. విమాన శకలాలూ ప్రయాణీకుల మాంసపు ముద్దలూ నిర్జీవమైన హైజాకర్ల ప్రతీకారేచ్ఛా చెల్లాచెదురుగా విశాల వీధుల్లోకి రాలాయి.

సోదరి విధ్వంసాన్ని ప్రత్యక్షంగా చూసి, గడగడలాడిన పక్కనే ఉన్న మరో స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనం ఆ షాక్ నుంచి తేరుకునే లోగానే మరో విమానపు భీతావహ దాడితో కుప్పకూలింది.

మంటలు, ఆర్తనాదాలు, హాహాకారాలు.

క్షణాల్లో ఈ వార్తలు ప్రపంచాన్ని ఢీకొట్టాయి.

దేశ విదేశాల పౌరులూ దిగ్భ్రమ చెందారు.

అక్కడ ఉద్యోగాలు చేసే బంధువుల క్షేమ సమాచారాన్ని తెలుసుకునేందుకు ఐ.ఎస్.డి.లు అహోరాత్రం నెత్తీ నోరూ బాదుకున్నాయి.

ఇంత భీకర విధ్వంసానికి కారణం విమానాలు కాదు... ఉగ్రవాదులు...!

ఉగ్రవాదులంటే మనుషులే!

\- - -

సెప్టెంబరు 16, భారతదేశం, తెలంగాణా జిల్లాలో ఓ గ్రామం...


ఊరిబయట.

మహంకాళమ్మ గుడి. ప్రాంగణం నిండా జనం.

ఓ చెట్టు కింద సమావేశం.

అరుగుపై ఆరుగురు ఆసీనులయ్యారు. అందరూ 'పెద్దమనుషులే' ఆ ఊరికి.

గ్రామస్థులంతా రెండు వరసలుగా బారులుతీరి నిలబడ్డారు. మధ్యలో ఓ వృద్ధుడు. అమాయకపు చూపులు. నుదుటిపై జీవితపు చీకటి కోణాల




తాలూకు ముడతలు. కళ్లల్లో భయంతో కూడిన దైన్యం. అసహాయత ఆసరాగా అన్యమనస్కంగా కూచొని ఉన్నాడు.

వృద్ధుడెదురుగా ఓ మధ్య వయస్కుడు. దృఢకాయం. మొహం నిండా దర్పం. నుదుటిన పెద్ద బొట్టు. చొక్కా స్థానంలో ఉత్తరీయం. చేతులకు మూడుచోట్ల విభూతి నామాలు. కళ్లల్లో ఆజ్ఞాపూర్వక వికృత తేజస్సు. 'మంత్రగాడిగా పేరు ప్రతిష్టలు.

ఇద్దరి మధ్యా రంగుల ముగ్గు. పిండిబొమ్మ. రెండుగా చీలివున్న కొబ్బరికాయ. అగరుబత్తీలు. మంత్రించిన నిమ్మకాయ. పక్కనే చాకు.

మంత్రగాడి పెదాలు నిరాటంకంగా కదులుతూనే ఉన్నాయి. నొసలు చిట్లుతూనే ఉన్నాయి.

గొణుగుతున్నట్లుగా మంత్రాలు. ఉన్నట్టుండి పెద్దపెద్ద అరుపులు. మంత్రగాడి మొహంలో నిమిషానికోసారి సంభ్రమాశ్చర్యాలతో కూడిన భావాలు. ఏదో పసిగడుతున్నట్లు రహస్యాన్ని ఛేదిస్తున్నట్లు చూపుల సారాంశం.

'జయమ్మా!'- అరిచాడు మంత్రగాడు.

జనంలోంచి ఓ మహిళ లేచింది. ముగ్గు వద్దకు నడిచింది.

'నా కళ్లల్లోకే చూస్తూ చెప్పు. నీకు రాత్రి గిట్ల కలేమైనా అచ్చిందా?'

'అవ్ సామీ! గీ ముసిలోడే కనబడిండు. ఎయ్యో మంత్రాలు జేసిండు. గీ రాత్తిరే కాదు సామీ... మూణ్ణెల్లుగా కల్లోకొస్తుండు. అప్పటి సంది నా ఆరోగ్యం కరాబు కాబట్టె'.

'చూసినారా... చూసినారా... నేఞ్జెప్పలే!' అంటూ మంత్రగాడు చాకుతో నిమ్మకాయ కోశాడు.

రక్తం కారింది.

జనం నోరెళ్లబెట్టారు. బిగుసుకుపోయారు. తేరుకున్నాక ఆగ్రహంతో ఊగిపోయారు.

'మా పోరగానిక్కూడ గీ ముసిలోడే మంత్రాలు జేసిండు. ఇస్కూలుకెళ్లుడు బందుజేసి పొలాలంట దిరుగుతుండు'- జనంలోంచి ఓ కంఠం ఆరోపణ.

'మా గేదెలు నాలుగూ ఈసుకుపోయినయ్. మా ఇంట్ల పాలు బోయించుకు పొయ్యేందుకొచ్చి, పశువులకు మంత్రాలేసిండు'- మరో ఫిర్యాదు వినిపించింది.

సుదీర్ఘ చర్చ. ఏం చేయాలా వృద్ధుణ్ని?

చివరికో నిర్ణయం. పెద్దల ప్రకటన.

గుడి మెట్ల వద్దకు బరబరా ఈడ్చుకొచ్చారు. అమ్మవారికి బలి ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. వృద్ధుడి ఆవేదన, జనారణ్యంలో రోదన. అంతలో...

అక్కడెక్కడో ఓ మనిషి హృదయం కదిలింది.

పోలీసులకు సమాచారమందించాడు.

వారు హుటాహుటిన గుడి వద్దకు చేరుకున్నారు.

అకృత్యాన్ని అడ్డుకున్నారు.

- - -

సెప్టెంబరు 22, అదే గ్రామం...

నెల రోజుల వ్యవధిలో ఈరోజు జరిగింది అయిదో అగ్ని ప్రమాదం. రాయుడి గారి గడ్డివామి తగలబడింది. ఒకటా రెండా... పదెకరాల్లోని వరిగడ్డి. ఉవ్వెత్తున మంటలు. ఆయనలో ఆగ్రహం.

ఊరికేదో కీడు సోకిందట!

రాయుడి గారి ఆదేశం. అనుచరగణం ప్రచారం. ఊరు ఖాళీ చేయాలి. ఒక్కరోజే పిల్లాపాపల్తో సహా ఊరవతల చెట్ల కిందకి పోవాలి. ఇరవై నాలుగ్గంటలు గడపాలి.

ఇంటింటా చందాల సేకరణ.

నిధి నిర్వహణకర్త రాయుడు.

ఊరవతల ఉన్నవేళ అన్నపానీయాల అమరిక.

ఆరోజు ఊరు ఖాళీ అయింది. శివారు కళకళలాడింది. ఆ పగలూ రాత్రీ గ్రామంలో ప్రజలెవ్వరూ కనిపించలేదు- రాయుడి అనుచరగణం తప్ప.

- - -

సెప్టెంబరు 29, కోస్తాలో ఓ గ్రామం...

రచ్చబండ. పెద్దల పంచాయతీ.

కొలువు తీరిన గ్రామస్థులు.

నిందితుడి స్థానంలో తలొంచుకు నించున్న యువకుడు. యువకుడి పొరుగున రెండిళ్లు. ఆ రెండిళ్లలోనూ ఆడుతూ పాడుతూ తిరిగే బాలురిద్దరు పది రోజుల తేడాలో నెత్తురు కక్కుకు చనిపోయారనేది అభియోగం.

కారణం బాణామతి. కర్త యువకుడు.

పంచాయతీ ప్రారంభం.

పొరుగు వారిద్దరి వివరణ. అయిదారు సంఘటనల నేపథ్యం. ప్రమాణాల ప్రహసనం.

ఒక్కటీ సాక్ష్యం లేదు. కేవలం కథనం.

యువకుడు గొంతు చించుకున్నాడు. పొరుగు వారిద్దరి నిర్లక్ష్యం వల్లే పిల్లలు అతిసార వ్యాధితో మరణించారన్నాడు.

అతడి వాదనను పెద్దలు నమ్మలేదు.

బాణామతిని నమ్మారు. పొరుగు వారి వివరణలను విశ్లేషించారు. యువకుడి 'ద్రోహాన్ని' ఊరి జనానికి విడమర్చి చెప్పారు. శిక్ష ఖరారు చేశారు.

గాలి వీచింది. యువకుడి మొహంలోని ఆత్మవిశ్వాసం కొట్టుకుపోయింది.

యువకుణ్ని శిక్షాపీఠంపై నిలబెట్టారు. రాళ్లతో కొట్టారు. పట్టుకారుతో పళ్లు పీకారు. విలవిలలాడి పోయాడా యువకుడు. క్రూర హింస. 'మనిషి'పైనే మనుషులు!

శిక్ష ఆగలేదు.

రక్తసిక్తమైన శరీరం నిర్జీవంగా నేలకు వాలింది.

ప్రజాగ్రహం చల్లారింది. ఇంటిముఖం పట్టారు.

పెద్దల ప్రతీకారం నెరవేరింది. పండగ చేసుకున్నారు.

- - -

2001 అక్టోబరు 7, ఆదివారం అర్ధరాత్రి...

ఆఫ్ఘనిస్థాన్. ముస్లిముల నేల.

సంవత్సరాల తరబడి పీడిస్తున్న కరవు. అంతర్యుద్ధాలు. భూమి కడుపులో కోటి మందుపాతరలు.

గాఢ నిద్రలో జోగుతున్న వేళ...

అమెరికా లోహ విహంగాలు

## జన్మంతా నవ్వాలి

'హాస్య కన్య'
ఉగాది కవతరిస్తానని
ఆలస్యంగా
గుమ్మం తట్టింది.
బుగ్గన చేతిని చేర్చి
ఆలోచించే సమయం లేదే!
నన్నూ, నా కవితను
చూసి నవ్వకు!
నిన్నలరించే
ఆభరణంగా
నిలవాలనే
తాపత్రయం తప్ప
నాకే కోరికా లేదు
నీలో నేను చేరితే
పండుగకు
కొత్త బట్టలు కొనుక్కున్నంత
ఆనందం
నవ్వుతున్నావ్ కదూ!
నవ్వాలి!
అలాగే నవ్వాలి!
జన్మంతానవ్వాలి!

-యలవర్తి అనూరాధ

విరుచుకుపడ్డాయి.

బాంబులు నేలను తాకి అగ్ని వర్షాన్ని ఆకాశంలోకి లేపాయి. ఇళ్లు నేలమట్టం. పదుల ప్రాణాలు నిర్జీవం.

చీకటి ఆకాశంలో ఉక్కు పక్షుల అగ్ని నేత్రాలు.

నేలను రక్షించుకునేందుకు సేనలు సన్నద్ధం. అధికారాన్ని దక్కించుకునేందుకు అధినేత వాగ్యుద్ధం.

అధినేత చిరునామా అతి రహస్యం!

సామాన్యుడి ఉనికి ప్రశ్నార్థకం. ఎండ, చలి, భార్యాపిల్లల ఆకలి కేకలే ఆస్తిపాస్తులు.

ప్రాణ రక్షణ కోసం పరుగులు.

సరిహద్దుల వద్ద ఛీత్కారాలు.

మనిషిప్పుడు ఆఫ్ఘాన్ నేలపై మానని గాయం!

- - -

అక్టోబరు 10, రాయలసీమలో ఓ గ్రామం...

ఊరి నడిబొడ్డు.

జనం కేరింతలు.

నలభయ్యేళ్ల నారాయణ ఇప్పుడు బందీ.

అభియోగం : ప్రేమజంట మరణం

కారణం : మంత్రాల ప్రయోగం

నేరం : నారాయణదేనని తీర్మానం

చిరకాలంగా రగులుతున్న ఫ్యాక్షన్ గొడవల్లో భాగంగా ప్రియుణ్ని ప్రేమికురాలి అన్నయ్యలే నరికి చంపారని, ఆమె ఆత్మహత్య చేసుకుందనీ నారాయణ వివరణ.

పెద్దలు నమ్మలేదు.

మంత్రాలు వేయటం ప్రత్యక్షంగా చూసిన వారితో సాక్ష్యాలిప్పించారు.

మరికొన్ని సంఘటనల్ని ఉటంకించారు.

జనంతో తమ తీర్పునకే ఓటేయించుకున్నారు.

శిక్షను ప్రకటించారు.

అమలులో భాగంగా...

నారాయణను నిర్బంధించారు.

కదలకుండా తాళ్లతో కట్టేశారు.

అతడికెదురుగా పెద్ద పళ్లెం. అందులో రెండు పెద్ద పెద్ద కత్తులు. మాంసం కోసేవి.

'పెద్దల' నుంచి పిల్లలదాకా ఒక్కొక్కరూ ఒక్కో వేటు!

కత్తులతోనే!

నారాయణ శరీరంపై కత్తుల కవాతు.

తెగుతున్న రక్తనాళాల బాధల కుంపటి.

ఏ ఒక్కరూ వదలి పెట్టలేదు.

నిలువెత్తు రక్తపు ముద్దను చూసి జాలిపళ్లేదు.

నరికి నరికి చంపారు.

అప్పుడు కలిగింది జాలి.

ఖననం చేసి 'ఉదారత'ను చాటుకున్నారు.

మూఢ నమ్మకమూ ఆయుధమే.

'మనిషి'ని తెగ నరకడానికి.

- - -

2001, అక్టోబరు 14...

సెప్టెంబరు 11 దాడుల తర్వాత నాలుగో ఆంత్రాక్స్ కేసు నమోదు.

కజకిస్థాన్‌లో సోవియట్ హయాం నుంచీ ఉన్న ఒక ఆయుధ కేంద్రంలో ఆంత్రాక్స్ స్టోర్లు ఉన్నట్లు అమెరికా ఆయుధ తనిఖీ అధికారుల

గుర్తింపు.

ఐరోపాలోనూ ఆంత్రాక్స్ భయం. జీవాయుధ బెదిరింపులు. ఆంత్రాక్స్– వ్యాధికారక బాక్టీరియా! శరీరంపై గాయాల ద్వారా లోనికి ప్రవేశిస్తుంది.

ఈ బాక్టీరియా సోకిన మాంసాన్ని సరిగా ఉడికించకుండా తింటే... గ్యాస్ట్రో ఇంటెస్టయినల్ ఆంత్రాక్స్!

'మనిషి' మేధలోంచి ఉద్భవించిన మీడియా పుణ్యం.

క్షణాల్లో వార్తా ప్రసారం.

వీక్షకులకూ పుష్కలంగా పరిజ్ఞానం!

ఆంధ్రాలోనూ ఆంత్రాక్స్ గొడవే.

మాంసం తినకూడదంట. ఆ జబ్బొస్తే మందులే లేవట. ఇంట్లో ఒకళ్లకొస్తే అందరికీ పాకుతుందట. మానవ పంచాంగం. విజ్ఞానం ఒకటి. అపోహలు అయిదు. ఉగ్రవాదపు ఉరుమురిమి కంప్యూటర్లపైనా పడింది. ఇప్పుడు ఇంటర్నెట్లకూ 'దాడుల' భయం!

హైటెక్ యుగం. కంప్యూటర్ కాలం.

ప్రపంచం ఓ అంతర్జాతీయ గ్రామం.

గ్రామం నిండా జనం.

ఇద్దరో ముగ్గురో పెద్దలు. పెద్దన్నలు. అగ్రవాదులు. ఉగ్రవాదులు. అధికారం వీళ్లదే. అరాచకం వీళ్లదే.

సమాజం ఓ పరమపద సోపాన పటం.

వీళ్లు పాములు. వాళ్లు (జనం) పావులు.

అదను చూసి అవకాశమొచ్చినప్పుడల్లా కాటేస్తారు. విషం చిమ్ముతారు. బుసలు కొడతారు.

పడగల నీడన బిక్కుబిక్కుమంటూ జనం.

భయం భయంగా బతకటం నుంచీ, చారిత్రక పరిణామాల్లోంచీ పాఠాలు నేర్చుకోవాలంటే... మళ్లీ భయం.

అడవిని దాటిన మనిషి ఆధునికుడయ్యాడు.

ఆలోచన మాత్రం అడవిని దాటలేదు.

– – –

కొందరు మాత్రం అడవిని జయిస్తారు. ఆలోచనాయుధానికి పదును పెడతారు.

పావురాలనెగరేస్తారు.

'పెద్దల్ని' ప్రశ్నిస్తారు.

మనుషుల్ని మందలిస్తారు.

యుద్ధంలో మరణించిన పౌరుల్ని ఖననం చేయడానికి భూగోళం సరిపోదేమోనని ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

అనివార్యంగా ఐక్యరాజ్యసమితి శాంతి మంత్రం పఠిస్తుంది.

ప్రత్యేక బృందమొకటి శ్మశాన సీమకు పయనం.

జీవచ్ఛవాలతో చర్చలు.

రోజుకో కొత్త భయంతో బిక్కచచ్చిపోతున్న అగ్రరాజ్యంతోనూ మంతనాలు.

మెల్లగా ఇరువైపులా సానుకూల సంకేతాలు.

అలసటలోంచీ, మరణంలోంచీ మనిషి మనుగడపై భయాందోళనల్లోంచీ రాజీ గీతాలాపన.

ప్రయత్నాలు సాగుతుంటాయి.

– – –

గ్రామ సీమల్లో సాంస్కృతిక సందడి. గజ్జెకట్టి నర్తిస్తున్న కళాబృందాల చైతన్య గీతిక.

మూఢ నమ్మకాలపై సమర భేరి.

రక్తం కార్చే నిమ్మకాయ బండారం బట్టబయలు.

కలల కథలు వినిపించే కల్పిత గాథలు బదాబదలు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించని పెద్దలకు పారిశుద్ధ్యంపై పాఠ్యాంశాల బోధన.

ముఠా కక్షల వెనక మాటువేసిన మృగాల వ్యూహాలపై ఓ బుర్రకథ.

మనిషిలో విస్తరిస్తున్న ఎడారుల గురించి, అంతరిస్తున్న ఆకుపచ్చ అరణ్యాల గురించీ ఒగ్గుకథ. ఓ వీధి నాటిక.

కళా ప్రదర్శనలున్నాయి.

మరి మనుషులేరీ?

మనిషి మహా మేధావి!

వీధిన పడి పడిగాపులు కాసే పని లేకుండా ప్రదర్శనలన్నిటినీ ఓ పెట్టెలో అమర్చుకున్నాడు.

ఇంట్లోనే కూచొని ఆరా తీస్తున్నాడు.

మనిషి కనిపెట్టిన సమస్త ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ముందు...

మనిషిప్పుడు మహా మరుగుజ్జు!